# భాగం 23 సంక్షేప రచనా పద్ధతి

## విషయ క్రమం

23.0 ఉద్దేశం
23.1 ప్రవేశిక
23.2 సంక్షేప రచనా పద్ధతి
23.3 సంక్షేప రచనా ప్రయోజనం
23.4 సంగ్రహీకరణా లక్షణాలు

23.4.1 సంక్షిప్త రచనా పరిమాణం
23.4.2 సంక్షిప్త రచనా స్వరూపం
23.4.3 శీర్షిక పెట్టే పద్ధతి

23.5 సంక్షేప రచనలో పాటించవలసిన ముఖ్య సూచనలు
23.5.1 విధులు
23.5.2 నిషేధాలు

23.6 సంక్షేప రచనలో భాషాశైలులు

23.6.1 భాష
23.6.2 శైలి

23.7 కొన్ని మాదిరి ఖండికలు

**అభ్యాసాలు చేయండి**
23.8 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

**అభ్యాసాలకు మాదిరి జవాబులు**

## 23.0 ఉద్దేశం

ఏదైనా ఒక దీర్ఘ రచనను ఇచ్చి సంక్షేపించమంటే ఆ సంక్షేపించే విధానం ఏమిటి, సంక్షేపరచనా పద్ధతి ప్రయోజనం ఏమిటి, సంక్షేపించే సందర్భంలో పాటించవలసిన సూచన లేమిటి, ఆ రకం రచనలో ఏ శైలివాడాలి అన్న అంశాలను ఈ భాగం ద్వారా మీరు గ్రహించుకో గలుగుతారు.

## 23.1 ప్రవేశిక

నిర్ణీత ప్రయోజనాల కోసం ఒక్కొక్కప్పుడు మనం ఏదైనా ఒక దీర్ఘ రచనను సంక్షేపించ వలసిన అవసరం రావచ్చు. న్యాయవాదులు కేసులను సంగ్రహంగా రాసుకుంటారు. దిన పత్రికల్లో పనిచేసే విలేఖరులకూ, ఉపసంపాదకులకూ ఒక్కొక్క సందర్భంలో దీర్ఘమైన వార్తలను కుదించక తప్పని పరిస్థితులు ఏర్పడతాయి. అందువల్ల సంక్షేప రచనా పద్ధతిలో శిక్షణ ఏదో విధంగా మనందరికీ అవసరమే. సంక్షేప రచనాభ్యాసం వల్ల విషయనిష్ఠమైన ఏకాగ్రత అలవడుతుంది. రాయవలసిన విషయంగా సంగ్రహంగా, స్పష్టంగా రాసే గుణం అబ్బుతుంది. ఈ భాగంలో సంక్షేప రచనా పద్ధతి గురించి చర్చించుకుందాం.

## 23.2 సంక్షేప రచనా పద్ధతి

Precis writing అనే ఇంగ్లీషు పదానికి సమానార్థకంగా తెలుగులో సంక్షేప రచన అని వాడవచ్చు. సంక్షేపరచనను సంగ్రహీకరణ సారాంశరచనా, పద్ధతి టూకీ రచనా పద్ధతి అనే మాటల ద్వారా కూడా సూచించవచ్చు.

ఒక మూల రచన (మాతృక)లో ఉన్న విషయాన్ని సంగ్రహంగా చెప్పటం సంక్షేప రచనాలక్ష్యం. విషయాన్ని సంక్షేపించినప్పటికీ సంక్షేపించిన విషయం సమగ్రార్థ బోధకంగా ఉండాలి. అంటే మూల రచనను చదివిన ఫలం పొందటానికి అనువుగా ముఖ్యాంశాలు సంగ్రహీకరణలో ప్రతిఫలి స్తాయి. మాతృకలోని అప్రధాన వ్యాఖ్యలు, టిప్పణులు, వివరాలు సంక్షిప్తరచనలో ఉండవు. ముఖ్యాంశాలు మాత్రమే ఉంటాయి.

ఈ పాఠ్యాంశంలో ఆయా ఖండాలలోని వివిధ భాగాల కింద 'ముఖ్య విషయాలను గుర్తుంచు కుందాం' అనే శీర్షికలలోని విషయాలను, మీరు అధ్యయనం చేస్తున్నారు. ప్రతి భాగంలో చర్చించిన ప్రధాన విషయాల 'సంక్షేప రూపం' ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం.

## 23.3 సంక్షేప రచనా ప్రయోజనం

సంక్షిప్త రచనాభ్యానం వల్ల అనేక ఉపయోగాలున్నాయి. సంగ్రహీకరించే అభ్యానం వల్ల ఉపయో గాలున్నాయి, విషయం మనసుకు పట్టేటట్లు చదివే అలవాటు కలుగుతుంది. చెప్పవలసిన విషయాన్ని సంగ్రహంగా స్పష్టంగా చెప్పే అలవాటు కూడా కలుగుతుంది. పఠనాకాలంలో ఏకాగ్రత అలవడుతుంది. మాతృకలోని విషయం అర్థం చేసుకోకుండా సంగ్రహపరచటం అసాధ్యం. అందువల్ల విషయాన్ని చదివేటప్పుడు అర్థంపై దృష్టి నిలపటం అనేది అలవడుతుంది. ఆ విధంగా చదివిందీ, విన్నదీ వెంటనే అర్థం చేసుకుని మళ్లీ చెప్పటానికీ, రాయటానికీ ఇలాంటి లేఖనాభ్యానం బాగా తోడ్పడుతుంది. విషయాన్ని సంగ్రహపరచటానికి మాతృకలోని ముఖ్యాముఖ్య పదాలను పరిశీలించటం మించటం తప్పనిసరి. ఆ విధంగా ఇతరవ్యాసాలను రాసేటప్పుడు కూడా నిరుపయోగమైన పదాలను వదలివేసే అభ్యానం సంక్షేప రచనాభ్యానం వల్ల సమకూరు తుంది.

సాధారణ జీవితంలో కూడా సంగ్రహీకరణం పాతో అవసరం. న్యాయవాదులు 'కేసు' ను సంగ్రహంగా రానుకుంటారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే వారికీ, పత్రికా రచన చేసేవారికీ సంగ్రహీకరణం తప్పని సరి అంశం. ఈ సంగ్రహీకరణాభ్యానం అన్ని తరగతుల వారికీ నిర్ణీత ప్రయోజనాల కోసం అనేక విధాలుగా ఉపయోగపడుతుంది. అయితే సంగ్రహీకరణం అన్ని రచనలకూ చెల్లదు.

ఉదాహరణకు సూత్రప్రాయంగా చెప్పినదాన్ని సంగ్రహీకరించటం సాధ్యంకాదు.

**అభ్యాసాలు చేయండి**

సంగ్రహీకరణ వల్ల ముఖ్య ప్రయోజనాలను నాల్గింటిని పేర్కొనండి.

..........................................................................................

..........................................................................................

..........................................................................................

..........................................................................................

## 23.4 సంక్షేప రచన లక్షణాలు

ఏ రచననైనా సంక్షేపించ దలచుకున్నప్పుడు కొన్ని రచనా సూత్రాలను పాటించక తప్పదు. రచన ఎంతమేరకు సాగింది, మూల రచనలో లేని కొత్త భావాలు సంక్షేపరచనలో వచ్చి చేరాయా, శీర్షిక పేరు ఏరకంగా ఉంచాలి అనే అంశాలు సంక్షేపరచన లక్ష్యాలను నిర్ణయిస్తాయి.

### 23.4.1 సంక్షేప రచనా పరిమాణం

సాధారణంగా పొడవును బట్టి సంక్షిప్త రచన మూలంలో మూడో వంతు ఉంటుంది. ఈ సంగ్రహీకరణ పుటలను బట్టి కానీ, పంక్తులను బట్టికానీ ఉండదు. పదాల సంఖ్య సంక్షిప్త రచనలో ముఖ్యం మాటలను లెక్కించి మూడో వంతును నిర్ణయించటం పరిపాటి. మూలంలో వందమాటలుంటే సంక్షిప్త రచనలో ముప్పైలేదా ముప్పై అయిదు మాటలుండాలి మాతృకలో మూడువందల పదాలుంటే సంగ్రహీకరణలో వంద పదాలుంటాయి.

తెలుగులో పదాలను లెక్కపెట్టేటప్పుడు కొన్ని చిక్కులున్నాయి. తెలుగులో అయిదారు పదాలతో కూడిన సంస్కృత సమాసం రాయవచ్చు. సంక్షేప రచనలో అలాంటి సమాసాన్ని ఒక్క పదంగా లెక్కపెట్టరాదు. ఆ విధంగా సమాసాలను కూర్చి సంగ్రహ పరచినట్లు భావించటం ఆత్మ వంచన అయితే కొన్ని చోట్ల రెండు మూడు మాటలు ఒక్కపదంగా వర్తిస్తాయి. ఉదాహరణకు చొచ్చుకు పోయాడు' లాంటివి. ఇలాంటి ఉపక్రియలతో కూడిన వాటిని-రెండుపదాలుగా కాక, ఒక్కమాటగా లెక్కపెట్టాలి. ప్రత్యయాలను ప్రత్యేక పదంగా లెక్కపెట్టకూడదు.

### 23.4.2 సంక్షేప రచనా స్వరూపం

మాతృకలోని ముఖ్య భావాలన్నీ సంక్షేప రచనలో ఉంటాయి. కొత్త భావాలుగానీ, అదనపు విషయాలుగానీ సంగ్రహీకరణంలో ఉండవు. మాతృకలో దేనికెంత ప్రాధాన్యముందో సంక్షిప్త రచనలో కూడా అట్లాగే ఉంటుంది. శైలిమాత్రం మాతృకకన్నా సులభంగా ఉంటుంది. మాతృకలో అతిశయోక్తులూ, ఉత్ప్రేక్షలూ మొదలైనవి ఉన్నా సంగ్రహ రూపంలో ఉండవు.

సంగ్రహీకరణంలో అన్వయక్లేశం ఉండదు. కర్త క్రియ మొదలైనవి లోపించవు. క్రియలు భావార్థకంలో ఉండవు. ఉదాహరణకు నక్క, ద్రాక్షపళ్లు కథను సంగ్రహించి చెప్పేటప్పుడు "నక్క ద్రాక్షతోటకు పోవటం, పళ్లను చూడటం, మళ్లీమళ్లీ ఎగరటం, అందకపోవటం, పుల్లగా ఉన్నాయని భావించి వెళ్లిపోవటం" — ఈరకంగా సంక్షిప్త రచన కేవలం పొడి ముక్కలుగా ఉండదు.

పైవిషయం కింది విధంగా ఉంటుంది
"ఒక నక్క ద్రాక్షతోటలో పళ్లు చూసి వాటికోసం ఎగిరింది. ఎంత ఎగిరినా అవి అందకపోవటంతో పుల్లనివంటూ వెళ్లిపోయింది."

మూలంలో ఎన్ని పేరాలున్నాయో అన్ని పేరాలు సంగ్రహీకరణంలో ఉండక్కర్లేదు. మూడు పేరాలలో మూలం ఉన్నా సంక్షేపించే రచన ఒక్క పేరాలో ఉంటుంది.

సంక్షేపరచన అకృత్రిమంగా సుగమంగా భావాన్ని చక్కగా స్ఫురించేట్లుగా ఉంటుంది. అకృత్రిమం అంటే బలవంతంగా చెప్పినట్లు ఉండకుండటం, ఉదాహరణకు ఆ కాలంలో— అని మాతృకలో ఉంటే తత్కాలంలో — అని చెప్పటం కృత్రిమం.

సుగమంగా అంటే రచనలో చక్కని క్రమం ఉండటం. కాని, ఇలాంటి సంబంధ వాచక శబ్దాలు సంక్షేప రచనా శైలికి సారళ్యాన్నీ సుబోధకతనూ మృదుత్వం, సరళత్వం సమకూరుస్తాయి.

భావాన్ని చక్కగా స్ఫురింప చేయటం అంటే ఉచితమైన పదాలను ఏరుకుని అన్వయం ఉండేటట్లు చెప్పటం. వాక్యాలు కూడా పరస్పర సంబంధం కలిగి ఉండాలి.

### 23.4.3 శీర్షిక పెట్టే పద్ధతి

విషయానికి సంబంధించిన ముఖ్యార్థాన్ని బట్టి సంగ్రహరూపానికి శీర్షిక పెడతారు. సంగ్రహరూపానికి శీర్షిక పెట్టడం ఒక ముఖ్య కర్తవ్యం. సాధారణంగా మూలంలోని మొదటివాక్యం శీర్షికను స్ఫురింప చేసేదిగా ఉంటుంది. ఒక్కొక్కప్పుడు చివరి వాక్యం కూడా ముఖ్యాభిప్రాయం స్ఫురింపచేస్తుంది. దాన్నిబట్టి శీర్షిక ఉంచటానికి వీలు అవుతుంది. అవిధంగా స్ఫురింపచేసే వాక్యాలు కనపడకపోతే మూలాన్నంతా చదివి ముఖ్యార్థాన్ని బట్టి శీర్షిక పెట్టాలి.

**అభ్యాసాలు చేయండి**

అ. సంక్షిప్త రచనలో మూలాన్ని ఎన్నోవంతుకు కుదిస్తారు.
ఆ. సంక్షిప్త రచన స్వరూపం గురించి 5 పంక్తుల్లో రాయండి.

..........................................................................................................

..........................................................................................................

..........................................................................................................

..........................................................................................................

..........................................................................................................

..........................................................................................................

## 23.5 సంక్షేప రచనలో పాటించవలసిన ముఖ్య సూచనలు

మనం సంక్షేపించదలచుకున్న రచనలో పాటించవలసిన ముఖ్యాంశాలు ఉన్నాయి. అవి: 1. విధులు 2. నిషేధాలు వాటిని గురించి కొంత వివరంగా తెలుసుకుందాం.

### 23.5.1 విధులు

ముఖ్యార్థం బోధపడే వరకు మూలాన్ని రెండుమూడు సార్లు శ్రద్ధగా చదివి అవగాహన చేసుకోవాలి. మాతృకలోని పదాలూ, పదబంధాలూ, వాక్యాలూ మొదలైన వాటి అర్థం తెలుసుకోవాలి. మూలంలోని ముఖ్యాముఖ్యాలను వేరువరచాలి. ముఖ్యపదాలకింద గీటులుంచాలి. ప్రధాన అప్రధాన విషయ వివేచన తర్వాత సారాంశపు చిత్తుప్రతిని రాయాలి అప్రధాన విషయం చిత్తుప్రతిలో చొరవడిందా? ప్రధానవిషయం లోపించిందా? అనే కోణాలనుంచి చిత్తుప్రతిని విమర్శించాలి. తర్వాత సంక్షిప్త రచనలోని మాటలను లెక్కించి సంగ్రహం మూలానికి మూడోవంతు ఉందా? లేదా? అని సరిచూడాలి. తగినరీతి మాటలను తగ్గించాలి. లేదా హెచ్చించాలి. వర్ణక్రమం, వ్యాకరణం మొదలైన వాటికి సంబంధించిన దోషాలను సవరించి తగిన విరామ చిహ్నాలు ఉంచాలి. ఆ తర్వాత పరిష్కృత ప్రతి తయారు చేయాలి.

సాధ్యమైనంత వరకు సంగ్రహరూపం సొంతమాటలతో ఉండాలి. మాతృకలోని భావాలే సంగ్రహ రూపంలో ఉండాలి. మూలంలోని రీతి సంగ్రహీకరణంలో ప్రతిఫలించాలి. సంగ్రహరూపం సుబోధకంగానూ, నిర్దుష్టంగానూ ఉండాలి. మాతృకలో విషయానికెంత ప్రాముఖ్యముందో అంతే ప్రాముఖ్యం సంగ్రహరూపంలో ఉండాలి. మాతృకలోని విషయపరమైన ఏకత సంగ్రహీకరణంలో ఉండాలి. మూలంలోని విషయాన్ని విడవకుండా దానికి సంగ్రహమైన మారురూపం ఇవ్వాలి. సంక్షిప్త రచన స్వయం సంపూర్ణంగా ఉండాలి.

భాష సరళంగానూ, సూటిగానూ ఉండాలి. వక్తల ఉపన్యాసాలను భూతకాలంలో రాయాలి. సంక్షేప రచనను పరోక్ష వచనం పరోక్ష అనుకరణం (పరోక్ష అనుకరణం గురించి మీరు మొదటిఖండంలోని భాగం 6 లో చదివారు.) లో రాయటం మంచిది. ఆ విధంగా రాసిన తరువాత క్రియలకు సంబంధించి కాలం, వచనం మొదలైన వాటిలో వచ్చేమార్పులు చూడాలి. మూలంలో సర్వనామం ఉన్నా సంక్షిప్త రచనలో అర్థసౌలభ్యం కోసం అక్కడక్కడా సంజ్ఞావాచకాలను రాయవచ్చు. వీలునుబట్టి మాతృకలోని ఉత్తమ, మధ్యమ పురుష సర్వనామాలను సంక్షేప రచనలో ప్రథమ పురుషలోకి మార్చాలి. మొత్తంమీద సంక్షిప్తరచన సరళంగానూ నిర్దుష్టంగానూ ఉండాలి.

### 23.5.2 నిషేధాలు

మూలంలోని విషయాలను యథాతథంగా చెప్పకూడదు. మాతృకలోని వాక్యాన్ని సమాసంగానూ, సమాసాన్ని వ్యస్తపదంగానూ మార్చటంవల్ల సంగ్రహరూపమేర్పడదు. మూలంలోని వాక్యాలూ, సమాసాలు మొదలైన వాటిని సంగ్రహరూపంలో యధాతథంగా పొందుపరచడం అనుచితం. అంటే మూలంలోని సమాసాలు, వాక్యాలను కూర్చి సంక్షేప రచన చేయకూడదు. మూలంలోని కొన్ని మాటలను తీసివేసి, ఆ మిగిలిన వాటిని తిరగ రాయటం సంక్షేప రచన అనిపించుకోదు. అయితే మాటలను అవసరాన్నిబట్టి కురుచగా చేయవచ్చుగాని అది ఒక పద్ధతి అన్నట్లు చేయనవసరంలేదు. 'బుద్ధిమంతు' డైనవాడు, 'రాజైనవాడు' — అనే మాటలను 'బుద్ధిమంతుడు' 'రాజు' — అనేవిధంగా అవసరాన్నిబట్టి సంగ్రహించవచ్చు. ముఖ్యమైన విశేషణాలను తప్ప,

విశేషణాలన్నిటినీ చెప్పకూడదు. మూలంలోని హాస్యం, వక్రోక్తిలాంటివి సంగ్రహీకరణంలో ఉండదు. అవిధంగానే ఉదాహరణలు, పిట్టకథలు, పేరుల జాబితాలు సంగ్రహీకరణంలో మదింపుకు లోనవుతాయి. కొన్నిచోట్ల వాటిని తీసివేయాలి. ఆయా విషయాల ప్రాధాన్యాన్ని బట్టి కుదింపులూ, తీసివేతలూ చేయాలి. పునరుక్తులు ఉండకూడదు. సాధ్యమైనంత వరకు మూలంలోని పదాలను పరిహరించాలి. మాతృకలో లేని విషయాలు రాయకూడదు. ఉన్న విషయాన్ని వివరించకూడదు. తప్పులని తోచిన విషయాలను సవరించకూడదు.

సాధారణంగా సంక్షేపరచన సంభాషణాత్మకంగా ఉండదు. మూలం సంభాషణ రూపంగా ఉంటే సంక్షిప్త రచనలో సాధారణ వచన రూపానికి తేవాలి. అయితే అత్యంత ప్రాముఖ్యం కలిగిన ఒకటి రెండు సంభాషణలను సంగ్రహించవచ్చు.

అలాంటి వాటిని మూలంలో ఉన్నట్లే తీసుకోవాలి. అక్షరాలను ఇరికించి చిన్నవిగా రాసినంత మాత్రాన సంగ్రహీకరణం సంక్షేపరచన అనిపించుకోదు. మాతృకలో అప్రధానంగా ఉన్న విషయాలను సంగ్రహరూపంలో ప్రాధాన్యమిచ్చి రాయకూడదు. పెద్దపెద్ద మాటలనూ తెలియని పదబంధాలనూ వాడకూడదు.

**అభ్యాసాలు చేయండి.**

i) సంక్షిప్తరచనలో పాటించాల్సిన ముఖ్యమైన రెండు విధులనూ రెండు నిషేధాలనూ పేర్కొనండి.

............................................................................................................................................
............................................................................................................................................
............................................................................................................................................
............................................................................................................................................
............................................................................................................................................
............................................................................................................................................
............................................................................................................................................

## 23.6 సంక్షేపరచనలో భాషాశైలులు

సంక్షేపరచన చేయటం ఒక కళ. ఇది బుద్ధికి సంబంధించిన కళ. ఈ బుద్ధికి తోడు, సంక్షేపరచన చేసేవారికి భాషాజ్ఞానం తప్పనిసరి. శైలివట్ల స్పృహ చాలా అవసరం.

### 23.6.1 భాష

ఆధునిక ప్రామాణిక తెలుగు రాయటంలో కొన్ని ప్రాథమిక విషయాలు గమనించాలి. వీటిని ఖండం 1, భాగం 1 రాసే అలవాట్లు లోనూ భాగం 6 శైలి రచనా భేదాలలోనూ స్థూలంగా మనం చర్చించుకున్నాం.

సంక్షేపరచనలో వాక్యాలు చిన్నవిగా ఉండాలి. మాటలు సులభమైనవిగా ఉండాలి. తెలుగుమాటలు లేనప్పుడు మాత్రమే సంస్కృతం మాటలు వాడాలి. అవసరమైనప్పుడు సులభమైన కొత్తమాటలు కల్పించుకోవచ్చు. అలా వీలుపడనపుడు ఇతర భాషలలోని పదాలు తెచ్చుకోవచ్చు. అలాగే రూఢిలో ఉన్న ఇతర భాషాపదాలు - రైలుబండి, స్టీమరు లాంటివి - వాడుకోవచ్చు. పెద్దపెద్ద సంస్కృత సమాసాలు వాడరాదు.

ఉదాహరణకు :-

"అనాదరసూచక మందహాస రోచిరుదంచిత సుందర వదనుడు."
"అమందానంద కందళిత హృదయారవిందుడు"
లాంటి సమాసాలు వాడటంవల్ల సంక్షిప్త రచనా ప్రయోజనం దెబ్బతింటుంది.

కాబట్టి సంక్షేప రచనలో కఠినపదాలూ, పొడవైన సంస్కృత సమాసాలు వాడకూడదు. సంస్కృత భాషలో విభక్తి ప్రత్యయాలను దిగమింగి సమాసాలు చేసేపద్ధతి తెలుగుకు పొసగదు.

రెండు అర్థవంతమైన శబ్దాలు ఉచ్చారణలో దగ్గరగా వచ్చినపుడు జరిగే మార్పులను సంధి అంటారు. సంధి ఏర్పడే పద్ధతులను గురించి ఖండం 1, భాగం 2 లో మనం చర్చించుకున్నాం కూడా. వాక్యమధ్యంలో పదాలకు సంధిచేయకుండా మూలరూపాలతోనే రాయటంవల్ల చాలా

ఉపయోగం ఉంది పదం మూల రూపం తెలుస్తుంది. ఉదాహరణకు 'ఉంది' — అనే క్రియాపదాన్ని ద్రుతప్రకృతికం తర్వాత 'నుండి' అనీ, కళల తర్వాత సంధిరానిచోట 'యుంది' — అనీ, వ్ ఆగమం చేసి వుంది అనీ రాస్తారు. అలాకాకుండా 'ఉంది' — అని రాయటం సబబు. అయితే కొన్నిచోట్ల సంధిచేసిన రూపంతో రాయటం తప్పనిసరి. ఆ వివరాలకు 'సంధి' పాఠం చూడండి. నేటి తెలుగులో అరసున్నలూ, బండి 'ఱ'లు రాయనవసరంలేదు.

### 23.6.2 సంక్షిప్త రచనా శైలి

The Style is the Man himself — ఒకరి శైలి చూసి ఆ వ్యక్తే అంటాడు. సహజధోరణిలో రాయటమూ, సరసత - సారళ్యమూ, స్పష్టతా అనేవి శైలి ముఖ్యధర్మాలు. సహజధోరణిలో రాయటం అంటే వ్యక్తి తనకు స్వాభావికమైన రీతిలో రాయటం. ఇతరుల శైలిని అనుకరించి రాయటం సహజధోరణి అనిపించుకోదు. శైలికి డాంబికం పనికిరాదు. సారళ్యం కావాలి. అన్నిటికి మించి విషయ వ్యక్తీకరణలో స్పష్టత ఉండాలి. ఈ లక్షణాలు ఏరకం వచన రచనకైనా సాధారణంగా వర్తించేవే. సంక్షేపరచనలో మరొక ముఖ్యమైన లక్షణం పాటించవలసి ఉంటుంది. అది మూలరచనలోని ప్రధాన విషయాలను ఖచ్చితంగా సంక్షేపరచనలోకి తీసుకరావటం.

## 23.7 కొన్ని మాదిరి ఖండికలు

ఓ కప్పు కాఫీ ఖరీదు చాలు...మీరు ప్రపంచంలో ఏ మారుమూల నుంచి, ఏ భాషలోనైనా వెలువడుతున్న వార్తాపత్రిక, పుస్తకం చదవడానికి....మరి, 30 సంవత్సరాలలో ''సూపర్ కంప్యూటర్'' సాంకేతిక విధానం వల్ల, ఎలక్ట్రానిక్ గ్రంథాలయాలు విరివిగా రూపొంది ఇది అక్షరాలా సాధ్యమవుతుంది. ఈ శతాబ్దం అంతానికి మామూలు ట్రాన్సిస్టర్ రేడియోల సైజులో కేవలం 13,000 రూపాయిల ఖరీదుకు ''సూపర్ కంప్యూటర్లు'' వర్ధమాన దేశాలలో కూడా లభిస్తాయి. అమెరికా పిట్స్‌బర్గ్‌లోని కార్నేగి మెల్లన్ విశ్వవిద్యాలయం ''రోబోటిక్స్ ఇనిస్టిట్యూట్'' డైరక్టర్ డాక్టర్ రాజ్‌రెడ్డి ఆశ్చర్యకరమైన ఈ సంగతి చెప్పారు.

బొంబాయికి సమీపంలో వున్న పొవాయ్‌లోని ''ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐ.ఐ.టి) 25వ డిగ్రీ ప్రధానోత్సవ సమావేశంలో శుక్రవారం ఆయన ప్రసంగించారు. ''సూపర్ కంప్యూటర్లతో ఇకనుంచి విద్యార్థుల పరిశోధనలు చాలా సులువవుతాయి. పుస్తకాలను ఎంత శోధించినా దొరకని ఫలితాలు, భౌతిక, రసాయన శాస్త్రాలలో విరివిగా పరిశోధనలు జరపడానికి వీలుగా, ఇక ఎలక్ట్రానిక్ ప్రయోగశాలలు, గ్రంథాలయాలు ఏర్పడడం ఈ రంగంలో నూతన పరిణామాలని డాక్టర్ రాజ్‌రెడ్డి చెప్పారు.

ప్రయోగశాలలో సరైన సౌకర్యాలు, పరీక్ష నాళికలు, 'బున్‌సెన్ బర్నర్స్', రసాయనాలు ఇతర ప్రయోగ పరికరాలు కరవైన వర్ధమాన దేశాల విద్యార్థులకు 'సూపర్ కంప్యూటర్' టెక్నాలజీ బ్రహ్మాండంగా ఉపయోగపడుతుందని ఆయన అన్నారు.

ఆంధ్రజ్యోతి దినపత్రిక, జూలై 26, 1987

కుదింపును గమనిద్దాం.

కారుచౌక కంప్యూటర్లు

''ఇంకో ముప్ఫైఏళ్లలో ట్రాన్సిస్టర్ రేడియో పరిమాణంలో ఉండే సూపర్ కంప్యూటర్ కేవలం పదమూడువేల రూపాయలకే లభిస్తుంది. సూపర్ కంప్యూటర్ల సహాయంతో ఎలక్ట్రానిక్ గ్రంథాలయాలూ, ఎలక్ట్రానిక్ ప్రయోగశాలలూ రూపొందుతాయి. కొద్ది ఖర్చుతో ప్రపంచంలో ఎక్కడనుంచైనా ఏభాషలో వెలువడే పుస్తకాన్నైనా చదవవచ్చు. సూపర్ కంప్యూటర్ల సహాయంతో ఇకపై శాస్త్ర పరిశోధనలు సులభమవుతాయి. రొబొటిక్స్ నిపుణుడు డాక్టర్ రాజారెడ్డి బొంబాయిలో ఈ విషయాలు చెప్పారు.''

మూలంలో సుమారు నూటఇరవై పదాలు ఉన్నాయి. కుదింపు ఇంచుమించు సలభైపదాల్లో ఉంది. అంటే మూడోవంతుకు సరిపోయింది. ఈవిధంగా సంగ్రహీకరించినపుడు సంగ్రహించిన రచన అనావశ్యకాలైన పదాలు కనిపిస్తే వాటిని తీసివేయాలి. పొరబాటున విడిచి వేసిన అంశం ఉంటే దాన్ని చొప్పించి మళ్లీ రాయాలి. పై సంగ్రహంలో సూపర్ కంప్యూటర్ల సహాయంతో ఇకపై శాస్త్ర పరిశోధనలు సులభమవుతాయి అని చెప్పటం వల్ల ప్రయోగశాలల్లో సరైన సౌకర్యాలు, పరీక్షనాళికలు, బున్‌సెన్‌బర్నర్స్, రసాయనాలు, ఇతర ప్రయోగ పరికరాలు మొదలైన వాటి కరువును గురించి చెప్పక్కర్లేదు. రోబోటిక్స్ రంగంలో రాజ్‌రెడ్డి ప్రముఖుడు. కాబట్టి పదవిని విడిచి పేరునే చెప్పటం జరిగింది. మరొకమాదిరి రచన దాని కుదింపు ఎలాసాగుతాయో పరిశీలిద్దాం. ''మనుష్యుని తీరు వేఱు. వృద్ధి క్షయ సాధనములు రెండును చాలావఱకితని

చేతిలోనే యున్నవి. తన వృద్ధికెంత పనిచేయునో తన నాశనమునకునంతే, మఱియు నంతకన్న ఎక్కువగానే పనిచేయగలడు. చేయుచున్నాడు గూడ. వృద్ధి కంటె క్షయమును గలిగించు పనులే మనమెక్కువ వినోదము గల్గించుట సృష్టిలోని అనిర్వచనీయ రహస్యములలోనొకటి. పేదవారికి చేతులార దానమిచ్చుట కంటె పేకాట చేస్తులలో వినోదమెక్కువ కాదా? మన దేవతలే యిందుకు మొదటి దృష్టాంతములు. సృష్టికర్తయగు బ్రహ్మకు లేదు, రక్షణకర్తయగు విష్ణువునకు లేదు, నాశకర్తయగు ఈశ్వరునకున్నది గదా నాట్యమాడు నుల్లానము. కాబట్టియె యితర జంతువులకంటె మనుష్యుడు కొన్ని విషయములందు వృద్ధినెక్కువగా జూపినను మఱికొన్ని విషయములందు దీనిక్షయము దానిక్షయముకంటె నెక్కువగానేయున్నది. వాని క్షయమునకు దైవమొక్కటియే కారణము. వీని క్షయమునకు దైవమునకు తోడుగా వాడే పనిచేయును. కనుకనే మనుష్యుని వృద్ధి క్షయములలోనే రెంటిని పోల్చిచూడగా వృద్ధికంటె క్షయమే ఎక్కువగా నున్నదని భావించు వారును గలరు. ఎట్లును ఎంత యభివృద్ధికి వచ్చుటకు మనుష్యునికి సామర్థ్యము గలదో యంతకింకను రాలేదనుమాట యట్లుండగా ఎంత క్షయమును బొందనక్కఱలేదో యంతకు బాల్పడినాడనియు జెప్పవచ్చును.''

(రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ)

పై వచన ఖండిక గ్రాంథిక శైలిలో ఉంది. ఈ మూలరచనను ఆధునిక శైలిలో దిగువ సంగ్రహిస్తున్నాం గమనించగలరు :

కుదింపు :

### మానవుని వృద్ధిక్షయాలు

మానవుడి స్వభావంలో వృద్ధి అయ్యే ప్రయత్నంకన్నా నాశనం అయ్యే ప్రయత్నమే ఎక్కువగా ఉన్నట్లు అనిపిస్తుంది. తన నాశనమే మానవుడికి వినోదకరంగా ఉండటం విచిత్రం అనిపిస్తుంది. బ్రహ్మ విష్ణులకు లేని నాట్యమాడే కుతూహలం ఈశ్వరుడికి ఉండటం ఇలాంటిదే కాబోలు. జంతువులు దైవం వల్ల చస్తాయి. మానవుడు మానవుడి వల్లే చస్తాడు. కాబట్టి మనిషికి రాదగినంత వృద్ధి రాలేదు కానీ అక్కరలేనంత క్షయం కలిగింది.''

## అభ్యాసాలు చేయండి

i) కింది రచనను 50 పదాలలోకి సంక్షేపించండి.

జాతీయోద్యమం వెనకపడింది. జాతీయనాయకులు రాలిపోయారు. దేశం స్వతంత్రమయింది. బ్రిటిష వలసదార్లు నిలబెట్టిన అడ్డుగోడలు కూలిపోగానే, భారతీయులు ప్రపంచాన్ని నూటిగా చూడగలిగారు. పాశ్చాత్యుల వెంబడి ఇంగ్లీష చదువులూ, పాశ్చాత్య సంప్రదాయాలూ, సంస్కారమూ, ఒకవిధమైన ఆధునికత్వమూ దేశంలో వేరు తన్నినట్టుగానే, రెండవ ప్రపంచయుద్ధం ముగిసి, దేశం స్వతంత్రం కాగానే, సోషలిజమూ, వెల్‌ఫేర్ స్టేటిజమూ లాంటి సిద్ధాంతాలే గాక, వివిధ దేశాలలో పుట్టే అనేక రకాల ఫాషనులూ, ఉద్యమాలూ ఇక్కడికి [illegible]ళంగా వచ్చేశాయి. బీట్నిక్కులూ, ఆంగ్రీయంగ్‌మెన్ మొదలయిన వాళ్లు ఇతరదేశాలలో వెలసిన మర్నాడు మనదేశంలో వెలిశారు. ఈ నవీన ధోరణులకు ప్రతిగా సనాతనత్వమూ, ప్రజాతంత్రానికి విరుద్ధంగా ఫాసిస్టు భావాలూ దేశంలో చురుకెక్కాయి. ఈనాటి ప్రపంచంలో ఏయేమూలల ఏయే భావ సంఘర్షణలైతే ఉన్నాయో, అవన్నీ అంతో ఇంతో మనదేశంలో కూడా ఉన్నాయంటే అతిశయోక్తి కాదు.

ఈ తరంవాళ్లు అంతర్జాతీయ వాసనలు బాగా ఆకళింపు చేసుకున్న వారు; జీవితంతో అంతో ఇంతో అసంతృప్తిచెంది, అభ్యుదయకరమైన మార్పు కోరేవారు. వీరిలో జీవితాన్ని ఆట వస్తువుగా చూసి, విలాసాలలో విహరించటమే జీవితానందమనుకునే వారు, జీవితంలో మార్పులు రాకూడదనుకునే వారూ కొద్దిమంది లేకపోలేదు కాని, హెచ్చుమందికి దారిద్ర్యమంటే ఏమిటో తెలును. వీరిలో చాలామందిలో అభ్యుదయ భావాలున్నాయి. అవి కొంతవరకు జీవితంనుంచి నేర్చుకున్నవి. ధనాశా, పదవీ వ్యామోహమూ, లంచగొండితనమూ, మితిమీరిన సాంఘిక హక్కులూ జీవితాన్ని ఎంత కశ్మలం చేస్తున్నదీ వీరు స్వయంగా చూస్తున్నారు.

(కొడవటిగంటి కుటుంబరావు)

........................................................................................................................

........................................................................................................................

........................................................................................................................

........................................................................................................................

........................................................................................................................

........................................................................................................................

........................................................................................................................

........................................................................................................................

........................................................................................................................

ii) ఈకింది రచనను 50 పదాల్లో ఆధునిక శైలికి మారుస్తూ సంక్షేపించండి. నాకు పిఱికితన మెంతయో బిడియమంత. 'వెంటనరు' లోనేను ఉన్నటువంటి కుటుంబములలో ఇంటియామె కూతురు అతిథులను షికారుకు తీసికొనివెళ్లుట ఒక ఆచారము. ఆమె ఒకనాడు నన్ను చేరువనున్న చక్కని గుట్టలకు తీసికొని పోయెను. అనలు నాదే వడినడక. ఆమెది నాకన్న. అదియు ఇదియు మాటలాడుచు నన్ను వడిగా లాగుకొని పోవుచుండెను. ఒక్కొక్క తడవ నేనును ఏదో చెప్పుచునే యుంటిని. తుదకు 'ఔను' అనియో, 'కాదు' అనియో 'ఆహా ఎంత బాగుగా నున్నది' అనియో మెల్లగా అనుచు పోవుచునుంటిని. ఆమె పిట్టవలె పోవుచుండెను. ఎంతసేపటికి మరల ఇంటికి పోగలమా అని నేను నివ్వెఱపోవుచుంటిని ఇటుల మేము పర్వత శృంగమెక్కితిమి. అంతటి యెత్తు మడమల జోడు తొడిగికొనియు ఈ ఇరువది ఇరువదియైదేండ్ల కన్య వేగమున దిగుచుండెను. నేను క్రిందికి దిగుటకు క్రిందుమీదగుచుంటిని. పైపెచ్చు ఆమె ఎచట చూచిపోవునో, అని లజ్జ. ఆమె వెనుదిరిగి నవ్వుచు ఇటుదిగుమటుదిగుమనియు;ఊతయిచ్చి దింపనా అనియు అడుగ సాగెను. నావి కోడిపిల్ల గుండెలు. ఈ సాయముగూడ నెటుల చేయించుకొనగలను? తుదకు అతికష్టంమీద ప్రాకియు దేకియు, కొన్ని చోటుల కూరుచుండియు ఎటులో క్రిందికి ఊడిపడితిని. ఆమె శాబాస్, శాబాస్ అని బిగ్గరగా నవ్వి నన్ను ఎంత సిగ్గిలజేయగలదో అంత సిగ్గిల జేసెను.

(గాంధీ ఆత్మకథ, వేలూరి శివరామశాస్త్రి అనువాదం)

........................................................................................................................

........................................................................................................................

........................................................................................................................

........................................................................................................................

........................................................................................................................

........................................................................................................................

........................................................................................................................

........................................................................................................................

## 23.8 ముఖ్యవిషయాలను గుర్తుంచుకుందాం

- సంక్షేపించటానికి ఇచ్చిన రచనను చదివి ఆకళించుకుని ముఖ్యాంశాలను తక్కువ మాటల్లో రాయటం సంక్షేప రచనా పద్ధతి
- సంక్షేప రచన సమగ్రార్థ బోధకంగా, స్వయం సంపూర్ణంగా ఉంటుంది.
- సంక్షేప రచన చేసే అభ్యాసం వల్ల మననుకు పట్టేటట్లు రచనను లేదా విషయాన్ని చదివే అలవాటూ చేయవలసిన విషయాన్ని సంగ్రహంగా స్పష్టంగా రాసే అలవాటూ, ఏకాగ్రతా అలవడుతాయి.
- సంక్షేప రచన మూల రచనలో మూడోవంతు సాధారణంగా ఉంటుంది. పదాల సంఖ్యను సంక్షేపించేటప్పుడు గణించుకోవాలి. అయిదారు పదాలతో కూడిన సంస్కృత సమాసాన్ని ఒక్క పదంగా లెక్కపెట్టకూడదు. ఉపక్రియలతో కూడిన పదబంధాలను ఒక్కమాటగా లెక్కపెట్టాలి. ప్రత్యయాలను ప్రత్యేక పదంగా లెక్కపెట్టకూడదు.
- కొత్తభావాలూ, విషయాలూ, సంగ్రహీకరణంలో చేర్చకూడదు.
- విషయానికి సంబంధించిన ముఖ్యార్థాన్ని బట్టి సంగ్రహరూపానికి శీర్షిక పెడతారు.
- సాధ్యమైనంతవరకు సంగ్రహరూపం సొంతమాటలతో ఉండాలి.
- భాష సరళంగా, సూటిగా ఉండాలి. సంక్షేప రచన పరోక్ష వచనంలో రాయటం మంచిది. వీలునుబట్టి ఉత్తమ, మధ్యమ పురుష సర్వనామాలను సంక్షేప రచనలో ప్రథమ పురుషలోకి మార్చాలి.
- మూలంలోని విషయాలను యథాతథంగా చెప్పకూడదు. పునరుక్తులు ఉండకూడదు.
- సంక్షేప రచన చేసేవారికి భాషాజ్ఞానం అవసరం.

## అభ్యాసాలకు మాదిరి జవాబులు

i) దేశం స్వతంత్రమయింది. స్వాతంత్ర్యానికి పూర్వం భారతీయుల మీద పాశ్చాత్యుల ప్రభావాలు వచ్చాయి. ఆ తర్వాత వివిధ ఉద్యమాలూ సిద్ధాంతాల ప్రభావాలు వచ్చాయి. వివిధ దేశాలలోని ఫాషన్లు ప్రవేశించాయి. మనదేశంలో నవీన ధోరణులు ఒకవైపు. మరొకవైపు ప్రతిగా సనాతన సత్యమూ, ప్రజాతంత్రానికి విరుద్ధంగా ఫాసిస్టు భావాలూ, ప్రపంచంలోని అన్ని మూలల్లోని భావసంఘర్షణలూ మనదేశంలో కూడా ఉన్నాయి. మనదేశంలో జీవితం ఆటవస్తువనుకునే కొందరున్నారు. జీవితం మారకూడదనే వారూ ఉన్నారు. చాలామంది జీవితంలోని వాస్తవం నుంచి అభ్యుదయ భావాలను నేర్చుకున్నారు.

ii) నాకు పిరికితనమెంతో బిడియమంత. వెంటనరులో ఉన్నప్పుడు మా ఇంటామె కూతురు నన్ను షికారు తీసుకవెళ్లింది. ఆమెది నాకన్న వడినడక. ఒక కొండ ఎక్కాం ఇద్దరమూ. ఎత్తు మడమల చెప్పులు వేసుకుని కూడా ఆమె వేగంగా దిగటం మొదలుపెట్టింది. నేను కిందికి దిగటానికి సతమతమౌతున్నాను. ఆమె చూస్తుందని సిగ్గు. వెనుతిరిగి చేయందించనా అంది. నాది కోడిపిల్ల గుండెకాయ. సాయం చేయించుకోలేకపోయాను. అవస్థలు పడి పాకుతూ దేకుతూ కొండదిగాను. ఆమె బిగ్గరగా నవ్వింది. సిగ్గుతో చచ్చిపోయాను.